ప్రజాశక్తి
గురువారం 9 ఫిబ్రవరి 2023
5
విజయనగరం



రాజీ పడండి... కష్టాలనుండి బయట పడండి

జిల్లా జడ్జి సాయి కల్యాణ్‌చక్రవర్తి

ప్రజాశక్తి-విజయనగరం

జాతీయ లోక్ అదాలత్ కేసులను రాజీ చేసుకుంటే కష్టాలనుండి బయట పడవచ్చునని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. రాజీ మార్గాన్ని కక్షిదారులందరు అనుసరించాలని సూచించారు. ఈనెల 11న విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో జరగబోయే లోక్ అదాలత్‌లను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించు కుంటే ఇరు పార్టీలు గెలిచినట్లేనని, డబ్బులు, సమయం వృథా కాదని తెలిపారు. అదాలత్ లో పలు సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసులను, మోటార్ ప్రమాద బీమా, ఎలక్ట్రిసిటీ కేసులు, ఎక్సయిజ్, చెక్కు బౌన్సు కేసులను పరిష్కరించవచ్చునని తెలిపారు.

త్వరలో విజయనగరం అర్బన్ మండలం

- విజయనగరం రెవెన్యూ డివిజన్‌లోకి నెల్లిమర్ల
- అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు
- రాష్ట్ర కేబినెట్‌లో నిర్ణయం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం అర్బన్ ప్రత్యేక మండలం కానుంది. ప్రస్తుతం చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోవున్న నెల్లిమర్ల మండలం విజయనగరం డివిజన్‌లో విలీనం కానుంది. జిల్లా కేంద్రంలో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నిర్మాణం కూడా చేపట్టనున్నారు. ఈ మేరకు సిఎం జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం ఆమోదం తెలిపింది. విజయనగరం కార్పొరేషన్‌గా అభివృద్ధి చెందడంతో చుట్టుపక్కల కొన్ని గ్రామాలు కూడా విలీనమైన విషయం విధితమే. ప్రస్తుతం కార్పొరేషన్ జనాభా సుమారు 3.13లక్షల వరకు ఉంది. ఈ నేపథ్యంలో విజయనగరం మండలం, కార్పొరేషన్‌కు ఒకే తహశీల్దార్ కావడం వల్ల చాలా రెవెన్యూ సేవలు సకాలంలో అందడం లేదు. దీనికితోడు మంత్రులు, ఉన్నతాధికారులు వచ్చినప్పుడు తహసీల్దార్, ఆర్ఐ వంటివారికి ప్రోటోకాల్‌కే సగం సమయం సరిపోతోంది. ఈ నేపథ్యంలో అర్బన్ కేంద్రంగా ప్రత్యేక మండలం ఉండాలన్న ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. మంత్రివర్గం ఆమోదంతో మరో కొత్త మండల కార్యాలయం ఏర్పాటు కానుంది.

నెల్లిమర్ల నగర పంచాయతీ విజయనగరానికి దాదాపు జంట నగరంగా ఉంటుంది. జిల్లాల పునర్విభజనలో భాగంగా చీపురుపల్లి రెవెన్యూ డివిజనలోకి మార్పుచేశారు. ఆ తరువాత మండల వాసులనుంచి అనేక విజ్ఞప్తులు వెళ్లడంతో మంత్రివర్గం సానుకూలంగా స్పందించింది. అర్బన్ కేంద్రాల్లో సేకరించిన చెత్తతో ఎరువుల, విద్యుత్ తదితరాల తయారీకి సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్లు ఏర్పాటు చేస్తున్న విషయం విధితమే. అందులో భాగంగా నెల్లిమర్ల నగర పంచాయతీలో సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ ప్లాంటు ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని రూ.1కే ఒక చదరపు మీటరు చొప్పున 20ఏళ్ల లీజుకు కేటాయించాలని నిర్ణయించారు.

వీటితోపాటు విజయనగరంలో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జీ కోర్టు ఏర్పాటుకు, లీగల్ సర్వీస్ ఇనిస్టిట్యూట్‌లో పోస్టుల భర్తీకి కూడా మంత్రి మండలి ఆమోదం తెలిపింది. పెట్టుబడిదారులతో మంగళవారం సిఎం నిర్వహించిన సమావేశంలో భోగాపురంలో 90 ఎకరాల్లో ఐటి పార్కు ఏర్పాటు చేస్తామని, ఎస్.కోట దరి మూలబొడ్డవరలో గతంలో అల్యూమినా కంపెనీ కోసం సేకరించిన 985ఎకరాల భూమిని స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ ఏర్పాటు కేటాయిస్తామని తెలిపారు.


విజయనగరం వ్యూ..

తెలుగుదేశంలో...

- నెల్లిమర్లలో పతివాడకు షాక్
- అంతకు ముందు కోళ్ల కంటతడి

సీనియర్ల శకం ముగిసినట్టేనా?



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తెలుగుదేశం పార్టీలో సీనియర్ల శకం ముగుస్తోందా? వారి స్థానంలో యువతరం లేదా కొత్త ముఖాలు రానున్నాయా? అంటే ఎక్కువ మంది నోట ఔననే సమాధానం వినిపిస్తోంది. ఇటీవల కాలంలో వరుసగా జరిగిన రాజకీయ పరిణామాలు అందుకు తార్కాణమంటూ పలువురు రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన అనంతరం ఆ పార్టీలో రాజకీయ పరిణామాలు వేడెక్కాయి.

ఇటీవల నియోజకవర్గాల వారీగా ముఖ్యులతో సమీక్షలు నిర్వహించిన చంద్రబాబు పలు నియోజకవర్గాల్లో మార్పులు, చేర్పులకు కసరత్తు చేసినట్టు సమాచారం. అందులో భాగంగానే విశాఖ వేదికగా జరిగిన టిడిపి విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ కమిటీ సమావేశంలో ఎస్.కోట నియోజకవర్గం నుంచి గొంప కృష్ణ అనే ఎన్ఆర్ఐను తెరపైకి తెచ్చారు. దీంతో, ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోళ్ల లలిత కుమారి కంటతడి పెట్టుకుంటూ బయటకు వచ్చేయడం, వచ్చే ఎన్నికల్లో కృష్ణకే ఎమ్మెల్యే సీటు ఇస్తారన్న ప్రచారం జరగడం చర్చనీయాశంగా మారింది. ఎస్.కోట వేడి చల్లారక ముందే ఇప్పటి వరకు సుమారు ఏడుసార్లు ఎమ్మెల్యేగా, పలు మార్లు మంత్రిగా పనిచేసిన పతివాడ నారాయణ స్వామినాయుడును నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యత నుంచి తప్పించి, భోగాపురం మండలానికి చెందిన కర్రోతు బంగార్రాజుకు కట్టబెట్టారు. ఈ నేపథ్యంలో సీనియర్ నేతగా ఆశీసులు తీసుకునేందుకు ఇంటికి వెళ్లిన కర్రోతుకు నారాయణస్వామి నాయుడు కలిసేందుకు అవకాశం ఇవ్వలేదు. మరోవైపు పార్టీ నిర్ణయాన్ని అంగీకరించడం లేదంటూ పతివాడ ప్రకటించారు. ఈ తరుణంలో పతివాడ, కర్రోతు మధ్య స్పర్థలు ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయో కొద్దిరోజుల్లోనే బయటపడనుంది. ఇప్పటికే ఈ నియోజకవర్గంలో ముగ్గురు నాయకుల మధ్య ఆధిపత్య పోరు కనిపిస్తోంది.

బొబ్బిలి నియోజకవర్గం నుంచి ఈసారి మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావును తప్పించి, ఆయన సోదరుడు బేబీనాయనను రంగంలోకి దింపే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్టు చర్చ నడుస్తోంది. అందుకు తగ్గట్టే ఇటీవల జిల్లాకు వచ్చిన చంద్రబాబు కూడా బేబీనాయనకు సభలో ప్రాధాన్యతనిచ్చారు.

రాజాం నియోజకవర్గంలో టిడిపి సీనియర్ నేత, మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, మాజీ మంత్రి కోండ్రు మురళి మధ్య అంతర్గత పోరు నడుస్తోంది. వచ్చే ఎన్నికల్లో తన కుమార్తె గ్రీష్మకు అసెంబ్లీ సీటు కోసం ప్రతిభా భారతి ప్రయత్నాలు చేస్తుండగా, మురళి కూడా అదే పనిలో ఉన్నారు. అయితే, చంద్రబాబు పర్యటనలో మురళికే ఎక్కువ ప్రాధాన్యత లభించిందని, టిక్కెట్ కూడా ఆయనకే వచ్చే అవకాశాలు ఉన్నాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

గజపతినగరంలో వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యేను ఆర్థికంగా ఎదుర్కొనే అభ్యర్థి కోసం వెతుకులాట సాగిస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఎవరైనా ఎన్ఆర్ఐకి ప్రాధాన్యత ఇవ్వచ్చనే ప్రచారం కూడా ఉంది. విజయనగరంలో మాత్రం అందుకు భిన్నంగా సీనియర్‌గా ఉన్న అశోక్‌నే తిరిగి అసెంబ్లీకి పంపేందుకు దాదాపు పార్టీ నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది.

గ్రామాల్లో రీసర్వే వేగవంతం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలో జరుగుతున్న భూముల రీసర్వే వేగవంతం చేయాలని ఆర్‌డిఒ డి. అప్పారావు సూచించారు. బుధవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో భూముల రీసర్వే పై ఆయన పరిశీలించి సమీక్ష జరిపారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ కెమెరాలతో ప్రభుత్వ, జిరాయితి, అటవీ భూములను గుర్తించి వాటికి సంబందించిన నంబర్లు కేటాయింపు ప్రక్రియ జరగాలన్నారు. ఆయా గ్రామాలకు చెందిన విఆర్‌ఒలు దగ్గరుండి డ్రోన్ సర్వే ఛాయా చిత్రాలు పక్కగా జరిపించాలని ఆదేశించారు. రీ సర్వేలో ఎటువంటి పొరపాట్లు ఉండరాదని పొరపాట్లు జరిగితే విఆర్‌ఓ సంభందిత అధికార్ల బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. తహశీల్దార్ కె.వి.రమణ రాజు మాట్లాడుతూ ఇప్పటికి 11 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసినట్లు ఆర్‌డిఒకు తెలిపారు.

మరో 9 మంది విద్యార్థినులకు అస్వస్థత

ప్రజాశక్తి-కొత్తవలస

మండల కేంద్రంలోని బిసి బాలికల వసతిగృహంలో కలుషిత ఆహారం తినడంతో 24 మంది విద్యార్థినులు మంగళ వారం అస్వస్థతకు గురై కోలుకున్న విషయం తెలిసిందే. హాస్టల్‌కు చేరుకున్న విద్యార్థినుల్లో మళ్లీ బుధవారం రాత్రి మరో 9 మంది అస్వస్థతకు గురయ్యారు. దీంతో అప్రమత్తమైన వార్డెన్ తహశీల్దార్ ప్రసాదరావు కు సమాచారం ఇచ్చారు. వైద్య సిబ్బంది వసతి గృహానికి చేరుకొని చికిత్స అందించినా కోలుకోపోవడంతో తహశీల్దార్ సూచన మేరకు విద్యార్థినులకు మెరుగైన వైద్యం కోసం ఎస్.కోట సిహెచ్‌సికి తరలించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ ఎం.సూర్యకుమారి వసతి గృహాన్ని సందర్శించారు. బాలికలతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉడికీ ఉడకని అన్నం..కలుషిత తాగునీరు

మధ్యాహ్న భోజనం కలుషితం

- 30 మంది విద్యార్థులకు అస్వస్థత
- డిఎంహెచ్ఒ పరిశీలన


విద్యార్థులకు పెట్టిన ఆహారం


విద్యార్థులకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది


అంబులెన్స్‌లో విద్యార్థులను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-మక్కువ

విజయనగరం జిల్లా కొత్తవలసలో జరిగిన ఘటన మరువకముందే మన్యం జిల్లాలో మరో ఘటన చోటు చేసుకుంది. మక్కువ మండలంలోని కోన ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థుల అస్వస్థతకు మధ్యాహ్న భోజనం కలుషితమవ్వడమే కారణంగా ఉంది. ఉడికీ ఉడకని భోజనాన్ని విద్యార్థులకు పెట్టడంతో వారంతా కడుపునొప్పికి గురయ్యారు. మరోవైపు పాఠశాలలో విద్యార్థులు తాగే నీరు కూడా కలుషితమైనట్లు అధికారులు గుర్తించారు.

పాఠశాలలో 144 మంది విద్యార్థులు చదువుతున్నారు. బుధవారం మధ్యాహ్నం స్కూలులో భోజనం చేసిన వారిలో 30మంది వరకు విద్యార్థులు కడుపునొప్పితో బాధపడుతూ అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు, వైద్యాధికారులకు సమాచారం ఇచ్చారు. మక్కువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హరికృష్ణ సిబ్బందితో అక్కడికి చేరుకొని అంబులెన్సులో పిహెచ్‌సికి తరలించారు. మరికొంతమంది తల్లిదండ్రులు అక్కడికి చేరుకొని ఆటోలపై కొందరిని ఆస్పత్రికి తరలించారు. పిహెచ్‌సిలో డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ రఘు పిల్లలకు వైద్య సేవలు అందించారు. వైద్య సిబ్బంది అప్రమత్తతతో అంతా కోలుకోవడంతో అధికారులు, పిల్లల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

బయటపడ్డ విభేదాలు

పాఠశాలలో హెచ్‌ఎంకు, విద్యా కమిటీ మిడ్ డే మీల్స్ నిర్వాహకుల మధ్య ఉన్న విభేదాలు ఈ సందర్భంగా బహిర్గత మయ్యాయి. అధికారుల సమక్షంలోనే ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. స్థానిక హెచ్‌ఎంపై మిడ్ డే మీల్స్ నిర్వాహకురాలు గొట్టాపు లక్ష్మి ఆరోపణలు చేశారు. రూ.4వేలు ఇస్తామని , బాధ్యతలనుంచి వైదొలగాలని అంటున్నారని తెలిపారు. విద్యార్థులకు గుడ్లు సరిగా ఇవ్వడం లేదని ఆరోపించారు. దీనికి ప్రతిగా హెచ్‌ఎం విద్యా కమిటీ నిర్వాహకులు


ఘటన గురించి విద్యార్థులను ఆరాతీస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

ఉపాధ్యాయులపై తల్లిదండ్రుల ఆగ్రహం

పాఠశాలలో గత మూడు రోజులుగా భోజనం అధ్వానంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉడకని అన్నం పెట్టి పిల్లలకు అనారోగ్యం తెచ్చిపెడుతున్నారని హెచ్‌ఎంపై మండిపడ్డారు. కలుషితమైన నీటిని వంటకు వాడుతున్నారని అన్నారు. పాఠశాలను పరిశీలించిన డిఎంహెచ్ఒ జనార్ధన్‌రావు, డిప్యూటీ డిఇఒ బ్రహ్మజీ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి ఆరా తీశారు. నివేదికను ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. అనంతరం దెబ్బగడ్డ గ్రామంలో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి యోగ క్షేమాలు తెలుసుకున్నారు.

ఎంఇఒ, హెచ్‌ఎం నిర్బంధం

తమ పిల్లలు అస్వస్థకు గురయ్యారన్న బాధతో హెచ్‌ఎం జయకుమార్‌ను, అక్కడికి చేరుకున్న ఎంఇఒ మల్లేశ్వరరావును తల్లిదండ్రులు పాఠశాల గదిలో పెట్టి నిర్బంధించారు. స్థానిక ఎస్ఐ పైడిరాజు తమ సిబ్బందితో వచ్చి తల్లిదండ్రులకు నచ్చజెప్పి వారిని బయటకు తీసుకువచ్చారు.

ఖాకీల మానవత్వం

గిరిజన మహిళ మృతదేహాన్ని ఒడిశా తరలింపు

ప్రజాశక్తి-విజయనగరం

ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా పొట్టంగి బ్లాక్ సొరడ గ్రామానికి చెందిన ఈడే గురు (30) అనే మహిళ అనారోగ్యానికి గురవ్వడంతో ఆమె భర్త సాములు విశాఖపట్నం జిల్లా తగరపు వలస వద్దగల అనిల్ నీరుకొండ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించాడు. చికిత్సకు స్పందించడం లేదని తిరిగి సొంత ఊరు తీసుకొని వెళ్లిపోవాలని వైద్యులు తెలిపారు. చేసేది ఏమీ లేక భార్యను తీసుకొని, ఆటోలో విజయనగరం వస్తుండగా మార్గ మధ్యంలో భార్య ఈడే గురు మరణించింది. ఆర్ధంతరంగా ఆటో డ్రైవరు చెల్లూరు రింగురోడ్డులో వారిని దించేసి వెళ్ళిపోయాడు. దిక్కుతోచని స్థితిలో భర్త తన భార్య శవాన్ని ఎలా ఒడిశాకు చేర్చాలో తెలియక భార్య శవాన్ని భుజం మీద వేసుకొని, కాలి నడకన బయలుదేరాడు. ఈ ఘటనను చూసిన స్థానికులకు ఏమీ జరిగిందో తెలియక, అతను ఒడియాలో చెప్పిన విషయం అర్ధంకాక స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న రూరల్ సిఐ టివి తిరుపతిరావు, గంట్యాడ ఎస్ఐ కిరణ్ కుమార్‌తో కలిసి, చెల్లూరు రింగు రోడ్డు వద్దకు వెళ్లి పరిశీలించ గా, సాములు తన భార్య మృత దేహాన్ని భుజాన వేసుకొని వెళుండడాన్ని గమనించా రు. విషయం తెలుసు కున్న పోలీసు లు ఒడిశాలో అతని బంధు వులతో ఫోనులో మాట్లాడారు. వారి విజ్ఞప్తి మేరకు రూరల్ సిఐ టివి తిరుపతి రావు ఒడిశా రాష్ట్రం సుంకి వరకు అంబులెన్స్ ఏర్పాటు చేసి మానవత్వం చూపారు. పోలీసులు అందించిన సహాయానికి శాములు కృతజ్ఞతలు తెలపగా, పోలీ సులను స్థానికులు అభినందించారు.


భార్య మృతదేహాన్ని భుజంపై మోసుకుని వెళ్తున్న సాములు


అంబులెన్స్‌లో మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

గెలుపే లక్ష్యం కావాలి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా అందరూ సమిష్టిగా కృషి చేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సుజాత కన్వెన్షన్ హాల్లో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జెసిఎస్ జోనల్ కన్వీనర్, రాష్ట్ర పరిశ్రమ అభివద్ధి మండల డైరెక్టర్ బంగారునాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోలగట్ల మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీలను శత శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిదేనని అన్నారు. నియోజకవర్గంలో నిరంతరం పర్యటనలు చేస్తూ ప్రజా అవసరాలను తెలుసుకొని వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. మూడు తరాల ప్రతినిధిగా అనునిత్యం ప్రజల కష్ట సుఖాలలో పాలుపంచుకుంటున్నట్లు తెలిపారు. ఎటువంటి బేషజాలు లేకుండా సాధారణ వ్యక్తి వలే ప్రజలతో మమేకమౌతూ సాధ్యమైనంత వరకు సహాయపడుతున్నామని గుర్తు చేశారు. సచివాలయ కన్వీనర్లు, గహ సారథులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలు అవుతున్న తీరు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, జోనల్ ఇన్‌ఛార్జులు ఈశ్వర్ కౌశిక్, బొద్దాన అప్పారావు, బోడసింగి ఈశ్వరరావు, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ కనకల సుజాత, సేవాదళ్ అధ్యక్షుడు బాల బ్రహ్మరెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, ట్రస్ట్ బోర్డు మెంబర్లు, డివిజన్ అధ్యక్షులు, వైసిపి నాయకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

రూ.80.20లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నగరంలోని వివిధ డివిజన్లలో రూ.80.20లక్షలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపన చేశారు. 23వ డివిజన్‌లోని బొండాడవీధి వద్ద రూ.31లక్షలతో రహదారి నిర్మాణానికి, 43వ డివిజన్ పాల్‌నగర్‌లో రూ.25.35లక్షలతోనూ, 49వ డివిజన్‌లో రూ. 9.85 లక్షలతోనూ, 50వ డివిజన్‌లో గాజులరేగ ప్రాంతంలో రూ.24లక్షలతోనూ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవా లకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి , జోనల్ ఇన్‌ఛార్జి డాక్టర్ విఎస్ ప్రసాద్ , 43వ డివిజన్ కార్పొరేటర్ దాసరి సత్యవతి, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, వివిధ డివిజన్ కార్పొరేటర్లు పిన్నింటి కళావతి, వింత ప్రభాకర్ రెడ్డి, పట్టా ఆదిలక్ష్మి, కనుగుల రాజా, వంతరం సురేష్ తదితరులు పాల్గొన్నారు

రాష్ట్ర సాధనే లక్ష్యం

ఉత్తరాంధ్ర పార్టీ జిల్లా కోఆర్డినేటర్ జనార్దనరావు

ప్రజాశక్తి-విజయనగరం

ప్రత్యేక ఉత్తరాంధ్ర రాష్ట్ర సాధనే తమ పార్టీ ఆవిర్భావ లక్ష్యమని ఉత్తరాంధ్ర పార్టీ విజయనగరం జిల్లా కోఆర్డినేటర్ పేడాడ జనార్దనరావు అన్నారు. బుధవారం ఆ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర జిల్లాలు వెనుకబాటుతోనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ ప్రాంత ముఖ్యమంత్రి అయినా, ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఉత్తరాంధ్ర అంటే నిర్లక్ష్యంగానే వ్యవహరించారని గుర్తు చేశారు. పదవులు అనుభవించిన ఇక్కడి నాయకులు సైతం ఈ ప్రాంతానికి ఎటువంటి సౌకర్యాలూ కల్పించలేక పోయారని విమర్శించారు. ప్రధానంగా విజయనగరం జిల్లాలో గిరిజన యూనివర్సిటీ, భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయమంటూ ఏళ్లుగా చెప్పుకొస్తున్నారని.. ఆచరణలో నేటికీ పనులు కూడా ప్రారంభించలేక పోయారని ఎద్దేవా చేశారు. జిల్లాలో ప్రభుత్వ వైద్యకళాశాల ప్రక్రియ సుదీర్ఘంగా సాగుతోందన్నారు. ప్రభుత్వ ఉన్నత విద్య కళాశాలలు సైతం విజయనగరం జిల్లాకు కలగానే మిగిలిపోతున్నాయని అన్నారు. తమ పార్టీ వ్యవస్థాపకులు మెట్ట రామారావు, విశాఖ కోఆర్డినేటర్ కూన రామారావు ఆధ్వర్యంలో వచ్చే ఎన్నికల్లో మొత్తం 53 శాసనసభ స్థానాలు, 8 ఎనిమిది పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. సమావేశంలో పార్టీ కోర్డినేటర్ కె.మురళీధర్ పాల్గొన్నారు.

ఎన్ఇపి రద్దుకు ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఎపి విద్యా పరిరక్షణ కమిటీ (ఎపిటిఫ్1938) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కోట జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.ఈశ్వరరావు, సీనియర్ నాయకులు ఎ.సదాశివరావు మాట్లాడుతూ విద్యా రంగాన్ని ప్రైవేటీకరణ, కాషాయికరణ, కార్పోరేట్ కరణ, కేంద్రీకరణ చేసే నూతన జాతీయ విద్యా విధానం దేశ ప్రజలకు అవసరం లేదన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 50వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, ప్రాథమిక పాఠశాలలను ముక్కలు చేయడాన్ని విరమించుకోవాలని, ప్రాథమిక పాఠశాలలో మాతృ భాషలో బోధన జరపాలని, జీవో 54,85,117 లను రద్దు చేయాలని, శాస్త్రీయ, లౌకికవాద, ప్రజాతంత్ర,స్వతంత్ర విద్యా విధానాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కృష్ణ, పైడిరాజు,శ్రీనివాసరావు, శ్రీదేవి, అప్పలరాజు, కూర్మారావు, కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



కోట జంక్షన్ వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్రీడలు శారీరక ఉల్లాసంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. బుధవారం చెల్లూరులోని లెప్రసీ మిషన్ ఒకేషనల్ కళాశాలలో నిర్వహించిన క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల గౌరవ వందరాన్ని ఆమె స్వీకరించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యానికే కాకుండా బుద్ధి వికాసానికి కూడా దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండాలన్నారు. గెలుపే ప్రాధాన్యం కాకుండా క్రీడల్లో పాల్గొనడమే మంచి అవకాశంగా భావించాలన్నారు. మరింత ప్రతిభను కనబరిచి సంస్థకు, కళాశాల యాజమాన్యానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని అభిలాషించారు. కార్యక్రమంలో వికలాంగ సంక్షేమ శాఖ ఎడి వివి జగదీష్, కళాశాల ప్రిన్సిపాల్ హెన్నా దినకర్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రిని, బేబినాయనను సత్కరిస్తున్న క్రోతు బ్రదర్స్

పార్టీ బలోపేతానికి కృషి : మాజీ మంత్రి

భోగాపురం : నెల్లిమర్ల నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ మంత్రి సుజయ్ కృష్ణరంగారావు, బొబ్బిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బేబినాయన అన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా ఎన్నికైన క్రోతు బంగార్రాజు వారిని బుధవారం బొబ్బిలిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని గజమాల, శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో భోగాపురం మండల పార్టీ అధ్యక్షులు క్రోతు సత్యనారాయణ, నాయకులు పిడుగు పోతురాజు, క్రోతు రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజ్ఞావికాస పరీక్ష పోస్టర్ ఆవిష్కరణ

జామి : ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి 26వ తేదీన నిర్వహించబోయే, ప్రజ్ఞావికాస పరీక్షను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు జామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష, యుటిఎఫ్ నాయకులు వెంకట్రావు మాట్లాడుతూ విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించేందుకు ప్రజ్ఞా వికాస పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్ష ప్రశ్నపత్రాన్ని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు పర్యవేక్షణలో తయారు చేయడం జరిగిందన్నారు. ఈ పరీక్ష మండల కేంద్రంలో ఆ రోజు ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఈ పరీక్షలో పాల్గొన దలచిన వారు ఎంట్రీ ఫీజు 25 చెల్లించాలన్నారు. రాణించిన వారిలో మొదటి వ్యక్తికి రూ.5వేలు, రెండో వ్యక్తికి రూ.3వేలు, మూడో వ్యక్తికి రూ.2వేలు బహుమతులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్‌ను చూస్తే టిడిపికి భయం : ఎమ్మెల్యే

బొబ్బిలి : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని చూస్తే టిడిపి భయపడుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్‌ను చూసి భయపడుతున్న టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో జగన్‌ను భయపెడతామని అనడం విడ్డూరంగా ఉందన్నారు. టిడిపి ఎన్ని పాదయాత్రలు చేసినా రానున్న ఎన్నికల్లో వైసిపిదే విజయమన్నారు. టిడిపిని నమ్మే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరన్నారు. సమావేశంలో ఆయనతో మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు, వైసిపి నాయకులు ఉన్నారు.

బొద్దాం పిహెచ్‌సిలో విజిలెన్స్ తనిఖీలు

వేపాడ : మండలంలోని బొద్దాం పిహెచ్‌సిలో విజిలెన్స్ సిఐ సింహాచలం, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ భారతి కలిసి బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలు, పరికరాల పనితీరు, మందుల వివరాలను పరిశీలించారు. అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

వియ్యంపేట ఆస్పత్రికి వితరణ

కొత్తవలస : మండలంలోని జిందాల్ స్టెయిన్ స్టీల్ కంపెనీ, జిందాల్ నగర్ యాజమాన్యం సి.ఎస్.ఆర్. యాక్టివిటీలో భాగంగా వియ్యంపేట పి హెచ్‌సికి విరాళంగా ఇన్వెర్టర్, రెండు బ్యాటరీలు, రెండు కంప్యూటర్లు, డెలివరీ లాంప్, ఫోకస్ లాంప్, ఛార్జింగ్ లైట్, బీపీ ఆపరేటర్ స్ప్రేయర్ చేసినట్లు జనరల్ మేనేజర్ హెచ్.ఆర్. గోపాలకృష్ణ తెలిపారు. వియ్యంపేట ఆసుపత్రి సిబ్బంది జిందాల్ కంపెనీ యూనిట్ హెడ్ దినేష్ శర్మకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

తడి,పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి

బొబ్బిలి : మున్సిపాలిటీలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఆదేశించారు. పట్టణంలో బుధవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని కోరారు. చెత్త రోడ్డు, కాలువల్లో వేస్తే జరిమానా విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమను ఆదేశించారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఖాళీ అవుతున్న నిర్వాసిత గ్రామాలు

భోగాపురం : భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రతిపాదిత ప్రాంతంలో నిర్వాసితులైన బైరెడ్డి పాలెం పంచాయతీ మూడవర్ల పేటకు చెందిన 35 నిర్వాసిత కుటుంబాలు బుధవారం పోలిపల్లి రెవెన్యూ పరిధిలో వారికి ఏర్పాటు చేసిన కాలనీలకు బయలుదేరారు. నిర్వాసిత కాలనీలో పూర్తిస్థాయిలో గృహాలు తయారీ కానప్పటికీ అధికారుల ఒత్తిడితో బయలుదేరినట్టు బాధితులు వాపోతున్నారు. పది రోజులు సమయం ఇవ్వాలని బాగుండేదని బాధితులు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా జీవనం సాగించినటువంటి ప్రాంతాన్ని వదిలి వెళ్లేందుకు బాధితులు కన్నీరు మున్నీరయ్యారు. నిర్వాసితుల ఇల్లులన్నీ పూర్తిస్థాయిలో నేలమట్టం చేశారు. నిర్వాసితులకు లింగాలవలస మెట్టపై యాత కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లబోయిన సర్వేంగారావు భోజన సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

రక్తదాన శిబిరం విజయవంతం

గజపతినగరం : స్థానిక సాయి సిద్ధార్థ విద్యా సంస్థల ఆధ్వర్యంలో బుధవారం కళాశాల ప్రాంగణంలో జరిగిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 45 మంది రక్తదానం చేశారు. రక్తదాతల నుంచి గజపతినగరం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. కృష్ణారావు ఆధ్వర్యంలో వైద్య బృందం రక్త నిల్వలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రతి ఒక్కరూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు అని అన్నారు. రక్తదానంతో మరొకరి ప్రాణాలను కాపాడిన వాళ్ళు అవుతారని అన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ ఎస్ కృష్ణారావు, డాక్టర్ రాజు, డాక్టర్ రత్నకుమారి, కళాశాల కరస్పాండెంట్ ఎస్.చంద్రశేఖర్, ప్రిన్సిపల్ కెవి రమణ పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాల్లో విఒఎల పాత్ర కీలకం

వంగర : స్త్రీనిధి రుణాల్లో వి.ఒ.ఎ పాత్ర కీలకమని ఎంపిపి సురేష్ ముఖర్జీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వెలుగు ఆధ్వర్యంలో వి.ఒ.ఎలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి రుణాలు ఆయా గ్రామాల్లో మహిళలకు చేరవేయడంలో వి.ఒ.ఎల కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. బాగా పనిచేసిన వి.ఒ.ఎలు బి. ప్రియాంక, గౌరి, సూరమ్మ, లక్ష్మీ, తిర్లంగి చిన్నయ్యలకు ఆయన అభినందించారు. సమావేశంలో ఎపి చిరంజీవి, ఎపిఎం చక్రపాణి, మహిళా సమైక్య అధ్యక్షులు కె. భగవతి, క్లస్టర్ స్త్రీనిధి అధికారి సుధాకర్, అప్పలనాయుడు, ఎఫ్‌పిఒ గోవింద్ పాల్గొన్నారు.

మృతిని కుటుంబానికి ఆర్థిక సాయం

కొత్తవలస : స్థానిక మేజర్ పంచాయతీ కార్మికునిగా పనిచేస్తూ మృతి చెందిన బోని పెద్దులు కుటుంబానికి వారం గ్రామ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, శానిటేషన్ మేస్త్రి ఎం. ప్రసాదరావు తన సిబ్బంది కలిసి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక సహకారం అందించడం పట్ల పలువురు అభినందించారు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

బొబ్బిలి : మండలంలోని కోమటిపల్లి సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్తో పాటు ఐదుగురు ప్రయాణికులు గాయపడ్డారు. పోలీసులు వివరాలు మేరకు చింతాడ గ్రామానికి చెందిన యజ్జల పుష్పమ్మ, యామల పుష్పమ్మ, యామల మనోహర్, యజ్జల తవుడమ్మ, యజ్జల చిన్నమ్మలు బొబ్బిలిలో జరిగిన శుభకార్యానికి వెళ్లి తిరుగుముఖం ఆటోలో వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


అనురాధ దేశాయ్ కన్నుమూత

విజయనగరం కోట : ప్రఖ్యాత గాత్ర విదుషీమణి అనురాధ దేశాయ్ మంగళవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. సంగీత విషయంలో పలువురికి ఆమె సలహాలు, సూచనలు ఇచ్చేవారు. పలు సంగీత పోటీలకు ఆమె న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. విజయనగరానికి ఏ సంగీత కళాకారులు వచ్చినా ఆమె ఇంట్లో ఆతిథ్యం తీసుకోని వారు లేరంటే అతిశయోక్తి కాదు. మంగళంపల్లి, ఎమ్ఎస్ బాలసుబ్రహ్మణ్యశర్మ, ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం తదితరులకు ఆమె ఇంట ఆతిథ్యం ఇచ్చారు. ఆమె మృతికి దవళ సర్వేశ్వరరావు, మండపాక రవి సంతాపం తెలిపారు.

అత్యవసర సేవలు సద్వినియోగం

ప్రజాశక్తి - గుర్ల

పాడి రైతులు అత్యవసర సేవలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. బుదవారం గుర్లలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ముందుగా వైఎస్సార్ పశు ఆరోగ్య సేవ పథకం అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు వృద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అత్యవసర సేవలు అందించే దిశగా అడుగులు వేస్తోందన్నారు. పాడి రైతులు పశువులకు ఏవిధమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నా 1962 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయడం వల్ల వెంటనే సేవలు అందుతాయన్నారు. గుర్ల, గరివిడి మండలా రైతులు ఈ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలాస నియోజకవర్గం పరిశీలకులు కెవి సూర్య నారాయణ రాజు, ఎంపిపి పొట్నూరు ప్రమీల, జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, వైస్ ఎంపిపి తోట తిరుపతి రావు, వైసిపి యువ నేత పొట్నూరు సన్యాసి నాయుడు, వెటర్నరీ జెడి వైవి రమణ, స్థానిక ఎడి రమణాచలం, గుర్ల వైసిపి నాయకులు ఇజ్జిరోతు ప్రసాద్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.



గుర్ల: గ్రామస్తులతో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

కొత్తవలస: మండల కేంద్రంలో బుధవారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ లబ్ధి వివరాల కరపత్రాలను అందించారు. అనంతరం బిసి బాలికల వసతి గృహానికి వెళ్లి ఇటీవల జరిగిన విష ప్రయోగంపై ఆరా తీశారు. పిల్లల్ని జాగ్రత్తగా చూడవలసిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, మండల పార్టీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, ఎఎంసి వైస్ చైర్మన్ బొంతల వెంకటరావు, వైస్ ఎంపిపి కర్రి శ్రీనివాసరావు, లెంక రామన్నపాత్రుడు, ఎంపిటిసి లెంక అనూష, పెనగంటి చెల్లయ్య, ఆదిరెడ్డి అప్పన్న, ఐతంశెట్టి అనిల్ కుమార్ తదితరులు పల్గొన్నారు.

చెరువులు ఆక్తమిస్తే చర్యలు

రామభద్రపురం : సాగునీటి చెరువులు అక్రమిస్తే చర్యలు తప్పవని బొబ్బిలి ఆర్‌డిఒ శేష శైలజ హెచ్చరించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రీసర్వే పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో చెరువులు దురా క్రమణకు గురవుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని ఇలా అన్యాక్రాంతమవుతున్న చెరువులను పరిశీలించి ఆక్రమణ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ శైలజ

సమాధానం చెప్పని సమావేశమెందుకు?

ప్రజాశక్తి - వేపాడ

గత సమావేశాల్లో చెప్పిన సమస్యలను పరిష్కరించలేదని, కనీసం సమాధానం కూడా చెప్పనపుడు సమావేశాలు ఎందుకు నిర్వహిస్తున్నారని సభ్యులు ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం ఎంపిపి దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ తాము అడిగిన దానికి సమాధానం చెప్పనపుడు సమావేశాలకు ఎందుకు పిలుస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావును, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజును సభ్యులు ప్రశ్నించారు. బాణాది ఎంపిటిసి గొంప తులసి మాట్లాడుతూ తాను టిడిపి ఎంపిటిసిని కాబట్టి తన గ్రామానికి ఎంపిపి నిధులు ఇవ్వడం లేదని నిధులు ఇవ్వరా అని ప్రశ్నించారు. దీనికి స్పందించిన ఎంపిపి తరువాత మాట్లాడదామని దాటవేశారు. గ్రామ సర్పంచ్ ముకుందపురం కనకరావు మాట్లాడుతూ తమ గ్రామంలో రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని వ్యవసాయ అధికారి యశ్వంత్ ఇంతవరకు తీసుకోలేదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని వెంటనే తీసుకోవాలని ఎఒకు ఆదేశించారు. తమ గ్రామానికి తాగునీరు సక్రమంగా అందడం లేదని డిఆర్ పేట సర్పంచ్ కోరగా రక్షిత మంచినీటి పథకం మంజూరైందని టెండర్లు వేసి పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవిని ఆదేశించారు. వావిలపాడు సర్పంచ్ బీల రాజేశ్వరి మాట్లాడుతూ తహశీల్దార్ కృష్ణంరాజు కావాలనే తనకు ఏ సమస్య చెప్పినా పరిష్కరించడం లేదని కొంత మంది దళారులు చెప్పినట్లే ఆయన చేస్తున్నారని ఎమ్మెల్యేకు చెప్పారు. ఏ సమస్యనైనా గ్రామ సర్పంచ్ సమక్షంలోనే పరిష్కరించాలని తహశీల్దార్‌కు ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సేనాపతతి అప్పలనాయుడు వైస్ ఎంపిపిలు అడపా ఈశ్వరరావు, డిసిసి చైర్మన్ వేచలపు వెంకట చిన్న రాము నాయుడు, హోమ్ రైట్స్ నెంబర్ పద్మావతి, హౌసింగ్ డిఇ శ్రీనివాసరావు, ఎంపిడిఒ పట్నాయక్, ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజలతో మమేకమవ్వాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గజపతినగరం

రాబోయే అసెంబ్లీ ఎన్నికల సమయానికి పార్టీ మరింత బలమైన శక్తిగా ఎదగడానికి నాయకులు నిత్యం ప్రజలతో మమేకం కావాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆయన నియోజకవర్గస్థాయి నాయకులు, కన్వీనర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ ఇప్పటికే బలంగా ఉందని మరింత బలమైన శక్తిగా మారాలంటే గ్రామస్థాయి నుంచి అందరూ కలిసికట్టుగా శ్రమించాల్సి ఉందన్నారు. గృహ సారథులకు పంపిణీ చేస్తున్న ఐదు రకాల పార్టీ మెటీరియల్‌తో గడప గడపకు తిరిగి ప్రజాభిప్రాయ సేకరణ చేయాల్సి ఉంటుందన్నారు. 20వ తేదీ నుంచి గ్రామాల్లో గృహ సారథులు ఇంటింటికి కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ ఎస్‌సిసెల్ అధ్యక్షులు జైహింద్ కుమార్, ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సచివాలయ కన్వీనర్లు, మండల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

బిజెపి ఎమ్‌పి చంద్ర ప్రకాశ్‌ను బర్తరఫ్ చేయాలి : ఐద్వా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సతీ సహగమనం గొప్ప ఆచారమని కొనియాడని బిజెపి ఎంపి చంద్రప్రకాష్ జోషి ఆ పదవి నుంచి తప్పించాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.రమణమ్మ, ఎస్.పుణ్యవతి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చంద్రప్రకాష్ జోషి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ ప్రారంభిస్తూ సతీ సహ గమనం గొప్ప ఆచారమని కీర్తించడం సిగ్గుచేటని అన్నారు. రాజారామ్ మోహనరాయ్, వీరేశలింగం దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడితే బిజెపి పాలకులు, ఎమ్‌పిలు మాత్రం దురాచారాలను కీర్తించడం సంఘ విద్రోహక చర్య అని అన్నారు. మళ్లీ ఈ సమాజాన్ని ఎటు వైపు తీసుకు వెళ్లాలని అను కుంటున్నారని ప్రశ్నించారు. ఇటువంటి ప్రభుత్వాల పాలనలోనా మనమున్నది అని ఆందోళన వ్యక్తం చేశారు

అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాలు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కనిమెట్ట అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు జనసేన పార్టీ అండగా ఉంటుందని మండల పార్టీ అధ్యక్షులు జలపారి అప్పడుదొర తెలిపారు. బాధిత కుటుంబాలకు బుధవారం జనసేన ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. బాధితులు గడదేశి అప్పన్న, రాము, అప్పలరాజు కుటుంబాలను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తులు నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బూర్లె విజయశంకర్, దుక్క అప్పలరాజు, సిమ్మన్న, నర్సింగ్, సూరిబాబు, రమేష్, పిసిని నాగరాజు, మాదేటి ఈశ్వర్రావు, కిలారి రమేష్, లంకలపల్లి వెంకటేష్, బాడిత మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

మండలంలోని కనిమెట్టలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకుంటామని వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు తెలిపారు. బుధవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాదిత కుటుంబాలకు గృహాలను మంజూరు చేయడంతో పాటు, ఒక్కొక్కరికి 50 కేజీల బియ్యం, బట్టలు, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు అల్లాడ రమేష్, చంటి రాజు, లక్ష్మీనారాయణ, జనార్ధన్, జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనువాసరావు, కందివలస సర్పంచ్ గణేష్, కందివలస ఎంపిటిసి సత్తిబాబు, కనిమెట్ట నాయకులు, శాంతాటి శ్రీను, పళ్ళ సత్యం, తౌడు తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు నిత్యావసరాలను అందిస్తున్న వైసిపి నాయకులు

నెల్లిమర్ల: మండలంలోని పెద బూరాడ పేట గ్రామానికి చెందిన అగ్ని ప్రమాద బాధితులకు ఎమ్మెల్సీ డాక్టర్ పివివి సూర్య నారాయణ రాజు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ముంత అప్పయ్యమ్మ ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన విషయాన్ని తెలుసుకున్న ఆయన స్పందించి ఈ సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, సర్పంచ్ మక్కువ తవుడమ్మ, మక్కువ చిన సత్యం, మాజీ సర్పంచ్ యడ్ల గోవింద, స్థానిక వైసిపి నాయకులు ఉన్నారు.

ఒక్క ఛాన్స్ ఇచ్చినందుకే ఈ కర్మ

ప్రజాశక్తి- బాడంగి



నీటిలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి ఒక్క ఛాన్స్ ఇచ్చినందుకే మన రాష్ట్రానికి ఈ ఖర్మ పట్టిందని బొబ్బిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి బేబీ నాయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం మండలంలోని గొల్లాదిలో టిడిపి ఆధ్వర్యంలో జరిగిన 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో ఆయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయడు కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వీధుల్లో తిరుగుతూ రచ్చబండ కార్యక్రమం నిర్వహించి జగన్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. మూడున్నరేళ్లుగా ఏం ఘనకార్యం చేశారని, గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజల ముందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రానికి ఒక్క పరిశ్రమను తీసుకురాకపోగా టిడిపిలో తీసుకొచ్చిన పరిశ్రమను తుగ్లక్ నిర్ణయాలతో వెళ్లగొడుతున్నారని ఆరోపించారు. 2024లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని జోష్యం పలికారు. అనంతరం వేగావతి నది దగ్గర బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలని ఆందోళణ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు తెంటు రవిబాబు, రాష్ట్ర ఎస్‌టి జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు, నాయకులు పాముటే గోవింద్ ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ పి.నారాయణరావు అన్నారు. బుధవారం ఆయన స్థానిక వెంకట రమణ కళాశాలలో మాదక ద్రవ్యాలు వినియోగం వాటి వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌కి అలవాటు పడిన వారు విచక్షణ కోల్పోయి హత్యలు చేసే స్థాయికి వెళ్తారని ఆ పరిస్థితికి చేరకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం తంగుడుబిల్లిలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని పట్టుకొని అతని వద్ద నుంచి 35 మద్యం బాటిళ్లు, 5బీరు సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వేపాడ : మండలంలోని వల్లంపూడి ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో సిబ్బంది డ్రగ్స్ రహిత ఫ్లెక్సీలను ప్రధాన కూడలల్లో బుధవారం ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు.

రామభద్రపురం: మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు వాడకం అనర్థాలకు మూలమని ఎస్ఐ సురేంద్ర నాయుడు అన్నారు. బుధవారం స్థానిక వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనార్థాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిగరెట్, ఖైనీ గుట్కాల వల్ల కేన్సర్ వంటి ప్రాణాంతకమైన వ్యాధులు వస్తాయని దీంతో విలువైన జీవితాలు నాశనమవుతాయని చెప్పారు. ఈ మధ్య కాలంలో గంజాయి వాడకం పెరిగిందని, చిన్న వయసులోనే దాని ప్రభావం వల్ల అనారోగ్యానికి గురి అవుతున్నారని చెప్పారు. యువత వాటికి దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపిలో పెరుగుతున్న విభేదాలు

ప్రజాశక్తి- బొబ్బిలి

వైసిపిలో విభేదాలు రోజు రోజుకూ పెరుగుపోవడంతో మున్సిపాల్టీలో రెండు వర్గాలుగా విడిపోయాయి. రాష్ట్ర మంత్రి బొత్స, జిల్లా పరిషత్ చైర్మన్ చిన్న శ్రీను వర్గంగా ముద్రపడిన కౌన్సిలర్లను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ జనవరి 31న జరిగిన మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో కొంతమంది కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశం నుంచి వాకౌట్ చేసి నిరసన తెలిపిన విషయం తెలిసిందే. బడ్జెట్ సమావేశానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పల నాయుడు హాజరైనప్పటికి కౌన్సిలర్లు వినకుండా బడ్జెట్ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. వాకౌట్ చేసిన కౌన్సిలర్లతో చర్చించి సమస్య పరిష్కరించేందుకు ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ ఇప్పటికి సమావేశం ఏర్పాటు చేయలేదని చర్చ జరుగుతుంది. అప్పటి నుంచి పట్టణ వైసిపిలో రెండు వర్గాలుగా విడిపోయి ఉన్నట్లు తెలిస్తోంది.

గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు శిక్షణ వాయిదా

నియోజకవర్గం వ్యాప్తంగా గృహ సారథులు, జెసిఎస్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులకు శిక్షణ షెడ్యూల్ ప్రకటించారు. షెడ్యూల్ ప్రకారం బొబ్బిలి రూరల్, బాడంగి, రామభద్రపురం, తెర్లాం మండలాలో శిక్షణ జరిగినప్పటికీ బొబ్బిలి మున్సిపాలిటీలో శిక్షణ వాయిదా వేశారు. మున్సిపాలిటీ శిక్షణ షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తే కొంతమంది కౌన్సిలర్లు గైర్హాజరు అయ్యే అవకాశం ఉండడంతో శిక్షణ వాయిదా వేసినట్లు చర్చ జరుగుతుంది.

విభేదాలపై పికె టీమ్ దర్యాప్తు

మున్సిపాలిటీలో వైసిపి విభేదాలపై అధిష్టానం పికె టీమ్‌తో దర్యాప్తు చేపించారు. మున్సిపల్ కార్యాలయంలో అసమ్మతి కౌన్సిలర్లతో పికె టీమ్ సభ్యులు మాట్లాడి నివేదిక తయారు చేశారు. అసమ్మతికి గల కారణాలు, ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ పని తీరుపై ఆరా తీసినట్లు సమాచారం.



జెడ్‌పి చైర్మన్‌ను కలిసిన కౌన్సిలర్లు, వైసిపి నాయకులు

జెడ్‌పి చైర్మన్‌ను కలిసిన అసమ్మతి కౌన్సిలర్లు

అసమ్మతి కౌన్సిలర్లు జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును బుధవారం కలిశారు. పట్టణ రాజకీయాల పై కౌన్సిలర్లను ఆయన అడిగినట్లు సమాచారం. కౌన్సిల్ వాకౌట్, అసమ్మతికి గల కారణాలపై ఆరా తీసినట్లు తెలిస్తోంది.

నేడు పట్టణ వైసిపి నేతలతో సమావేశం

పట్టణ వైసిపి నేతలతో జిల్లా పరిషత్ హాలులో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గురువారం సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, ముఖ్య కార్యకర్తలు హాజరు కావాలని జెడ్‌పి చైర్మన్ పర్సనల్ కార్యదర్శి నుంచి ఫోన్లు వచ్చాయి. సమావేశంలో అసమ్మతికి గల కారణాలపై చర్చించి విభేదాలను సర్ది చెప్పేందుకు చర్యలు తీసుకుంటారని చర్చ జరుగుతుంది.

దళిత, గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

బొబ్బిలి రూరల్ : దళిత, గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని విజయనగరం జిల్లా బిఎస్‌పి అధ్యక్షులు, మదర్ థెరిసా సంస్థత అధ్యక్షులు సోరు సాంబయ్య, క్లవ్ కుపర్‌ల డిమాండ్ చేశారు. వారి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ఇందిరమ్మ కాలనిలో నివసిస్తున్న యనాది కులస్తులకు దశాబ్దాల కాలంగా కుల ధృవీకరణ పత్రాలు లేక ప్రభుత్వ పథకాలకు దూరం అవుతున్నారని, వారి పిల్లలను పనులకు పంపి చదువులకు దూరం అవుతున్నందున వారికి వెంటనే కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరారు. మండలంలో దళిత, గిరిజనులకు చెందిన భూములు కొంతమంది ధనికులు బలవంతంగా ఆక్రమించుకుంటున్నారని వారి భూములు వారికి ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలలని అన్నారు. పోడు వ్యవసాయం చేసుకొంటున్న గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని, బాడంగి మండలంలోని విరసాగరం గ్రామంలో 17 మత్స్యకార సంఘాల చెరువులు పెత్తందారుల నుంచి స్వాధీనం చేసుకొని వారికి ఇప్పించాలనే డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ ఎస్. రాజారావుకు అందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ తహశీల్దార్ విజయ్ కుమార్, కనక మహేష్, యనాది కుటుంబాలల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పుణ్యగిరి గెడ్డను ఆక్రమణల నుండి కాపాడండి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

రజక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన

పట్టణంలోని పుణ్యగిరి కొండల నుండి ప్రవహించే జీవధార గెడ్డను ఆక్రమణ నుంచి కాపాడాలని రజక సంఘం ఆధ్వర్యంలో బుధవారం రజకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ రజక సంఘం అధ్యక్షుడు రేగులబంద చిట్టిబాబు మాట్లాడుతూ గత 60 ఏళ్లగా పట్టణ రజకులు పట్టణంలోని పుణ్యగిరి రోడ్డులో శివాలయం వెనుక భాగంలో ఉన్న ఈ గెడ్డలో బట్టలు ఉతుక్కుంటూ సుమారు 60 కుటుంబాల జీవనం సాగిస్తున్నారన్నారు. కానీ నేడు ఆ గెడ్డను ఆనుకుని ఉన్న జిరాయితి భూముల వాళ్ల పుణ్యగిరి గెడ్డను ఆక్రమించేందుకు వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి గెడ్డలో ఉన్న చెట్లను తొలగించారన్నారు. ఏళ్లగా బట్టలు ఉతుక్కుంటూ జీవనం సాగిస్తున్న రజకులకు చెందిన బట్టలు ఉతికే బల్లలను, నేల బావులను మట్టితో కప్పి పుణ్యగిరి గెడ్డను ఆక్రమించి బట్టలుతుకుతూ జీవనం సాగిస్తున్న రజకుల బతుకు తెరువుకు భంగం కల్గిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై జిల్లా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశామని విచారణకు వచ్చిన జిల్లా అధికారులను సైతం జరాయితి భూములు వారు బెదిరిస్తున్నారని పుణ్యగిరి గెడ్డను ఆక్రమణదారుల నుండి కాపాడి కుల వృత్తులను ప్రోత్సహించాలని లేకుంటే జిల్లా రజక సంఘం ఆధ్వర్యంలో పుణ్యగిరి గెడ్డను కాపాడాలంటూ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.




నిరసన తెలుపుతున్న రజకులు

ఆక్రమణ వాస్తవమే

పుణ్యగిరి గెడ్డ ఆక్రమణ విచారణ నిమిత్తం బుధవారం వచ్చిన డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే బిఎన్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ గెడ్డ ఆక్రమణకు గురవడం వాస్తవమేనన్నారు. గెడ్డను సర్వే చేసి ఆక్రమణలకు పాల్పడిన వారికి నోటీసులు జారీ చేస్తామని అన్నారు.

24గంటలూ వైద్య సేవలందించాలి

మెరక ముడిదాం : ఆస్పత్రిలో 24 గంటలూ వైద్య సేవలందించాలని జిల్లా వైద్యాధికారి ఎస్‌వి రమణకుమారి తెలిపారు. బుధవారం ఆమె మెరకముడిదాం, గర్భాం పిహెచ్‌సిలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలలో వున్న అన్ని విభాగలను, పరిసర ప్రాంతాలను, ఆయా కేంద్రాలలో జరుగుతున్న వివిధ రకాల ఆరోగ్య కార్యక్రమాలు అమల తీరును పరిశీలించారు. అక్కడ ప్రజలకు అందుతున్న సేవలు గురించి ఆయా పిహెచ్‌సిల వైద్యాధికారులు అనిల్ రామ్ కుమార్ రెడ్డి, అజయ్ కుమార్, డాక్టర్ కె.సాంబమూర్తి లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిహెచ్‌సి సిబ్బందితో జరిగి న సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించటంలో వైద్యాధికారుల పాత్ర చాలా కీలక మైంద న్నారు. సేవలో ఎటువంటి అలసత్వం పనికి రాదని, క్షేత్ర స్థాయిలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిఎస్ ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందించి ప్రజా ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు. ఈ కా ర్యక్రమంలో రెండు పిహెచ్‌సిల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న డిఎంఅండ్ హెచ్ఒ